క్లుప్తంగా

కొనసాగుతున్న మేలుకొలుపులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో మేలు కొలుపుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ధనుర్మాసంలో భాగంగా ప్రతి రోజూ తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భక్తులు ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి భజనలు చేస్తూ దేవతామూర్తులను నిద్రలేపుతున్నారు. భోగి రోజున భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కోటవురట్ల: మేలుకొలుపు కార్యక్రమాలతో మండలంలోని పల్లెలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. కె.వెంకటాపురంలో గురువారం తెల్లవారుజామున మేలుకొలుపు నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, దీపారాధన అనంతరం గ్రామంలో నగర సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యుడు గొల్లు చిట్టిబాబు, భక్తులు పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం



మల్లవరంలో రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: స్థానిక తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు చొరవతో ఎన్నో ఏళ్లనాటి రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. మల్లవరం పంచాయతీ పరిధిలోని రైతులకు సంబంధించిన రహదారిని కొంత మంది ఆక్రమించి దుక్కు చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు గురువారం తహసీల్దార్ అందరితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేని సమస్య ఎట్టకేలకు తహసీల్దార్ పుణ్యమాని ముందుకు కదలడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ జనాభా జాబితాల ప్రకటన




ఎస్సీ జాబితా నోటీసు బోర్డులో అతికిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి: ఇటీవల నిర్వహించిన సర్వేకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభాకు సంబంధించిన జాబితాలు ప్రదర్శించామని, అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ నర్సింహమూర్తి కోరారు. గురువారం ఆయన న్యాయంపూడి సచివాలయంలో ఈ జాబితాలు ప్రదర్శించారు. ఇటీవల కాలంలో సామాజిక వర్గాల వారీగా సర్వేలు నిర్వహించి జనాభాను గుర్తించామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలన్నారు. సర్పంచ్ రెడ్డి వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనుల ప్రారంభం

మునగపాక: స్థానిక దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం పునర్నిర్మాణ పనులను కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డొక్కా నాగభూషణం, బొడ్డేడ అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, బీలా లక్షణరావు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో 'వీర్ బల్ దివస్'



గురుగోవింద్ సింగ్ కుమారుల చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

అచ్యుతాపురం: గురుగోవింద్ సింగ్ కుమారుల త్యాగం మరువలేనిదని బీజేపీ అచ్యుతాపురం మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు అన్నారు. అచ్యుతాపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వీర్ బల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. గురుగోవింద్ సింగ్ కుమారుల ఆత్మబలిదానాలు మరువలేమని, వారి సాహసాల గురించి నేటి తరానికి తెలియాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శీరా చిరంజీవి, మట్టా నూకరాజు, పాల్గొన్నారు.

'బెల్టు' జోరు.. పల్లె బేజారు.!

కూటమి ప్రభుత్వంలో బెల్టు షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అనేక మంది అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధిపాలవుతున్న సంఘటనలు కోకొల్లలు.

- కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, ఎక్సైజ్ అధికారులు
- మత్తులో జోగుతున్న గ్రామాలు





కొరుప్రోలు జంక్షన్‌లో రోడ్డుపై దొర్లుతున్న మందుబాబు



పేటసూదిపురంలో బెల్టుషాపు కోసం వేలం వేశారని గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు(ఫైల్)

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి బెల్టు దుకాణాలకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది. లైసెన్స్ దుకాణాలకు అనుసంధానంగా గ్రామాల్లో బెల్టు షాపులు యథేచ్ఛగా ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలంలో పేటసూదిపురం, చినగుమ్ములూరు గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటు కోసం దండోరా వేయించి మరీ వేలం నిర్వహించారంటే మద్యం సిండికేట్ ఎంత బరితెగించిందో అర్థం చేసుకోవచ్చు. కొరుప్రోలు గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ యథేచ్ఛగా బెల్టు షాపులు తెరుచుకోవడంతో సర్పంచ్ కర్రి సూరివేణి స్పందించి హోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. షాపుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఎక్సైజ్ అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గారేమో తెలియదు కానీ గ్రామాల్లో పర్యవేక్షణను గాలికి వదిలేశారు.

పరిమితికి మించి విక్రయాలు

ఇక లైసెన్స్ దుకాణదారులు ఒక వ్యక్తికి పరిమితికి మించి విక్రయించేస్తున్నారు. ఎన్ని మద్యం బాటిళ్లు కావలిస్తే అన్ని ఇచ్చి బెల్టు షాపులకు తరలించి గ్రామాల్లో విక్రయాలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో కిరాణా షాపుల్లో సైతం మద్యం లభిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అందుబాటులోకి మద్యం రావడంతో మందుబాబు పూటుగా సేవించి రోడ్డుపై ఎక్కడిపడితే అక్కడ దొర్లుతున్నారు. ఇక లైసెన్స్ దుకాణాల వద్ద మందుబాబుల కోసం నిబంధనలకు విరుద్ధంగా బార్ వాతావరణం ఏర్పాటు చేసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్యం పాలసీ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేసి బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. బెల్టుషాపులపై పలువురు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు మాత్రం శూన్యమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మండలంలో బెల్టు షాపుల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బెల్టుషాపులపై సమాచారం ఇవ్వండి



బెల్టుషాపుల నిర్వహణపై సమాచారమివ్వండి. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నాం. లైసెన్స్ దుకాణాదారులకు కూడా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయకూడదని హెచ్చరికలు చేశాం. గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి దాడులు నిర్వహించి పట్టుకుంటాం.

– విభీషణరావు, ఎస్ఐ, ఎస్.రాయవరం

కనకమహాలక్ష్మీ.. కరుణించమ్మా..



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నాలుగో గురువారం పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వర కుమారశర్మ ఆధ్వర్యంలో వేకువజామునే అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. యలమంచిలి పట్టణం, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ చినగుమ్ములూరు ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి డీఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోకులపాడు, చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు, భీమవరం, పెట్టుగోళ్లపల్లి, సీతారామపురం, నక్కపల్లి మండలం రామకృష్ణాపురం, దొడ్డుగళ్లు, బొదిగల్లు గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కోటవురట్ల: కైలాసపట్నంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు, గోవాడ గెడ్డ చైర్మన్ డి.వి.రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చామంతుల శ్రీనివాస్, అనపర్తి వరహాలరావు పాల్గొన్నారు.

వరి పనలపై జాగ్రత్తలు వహించాలి



రాజవరం వరి కుప్పలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: రైతులు వరి పనలపై జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని రాజవరం, కేశవరం, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు కోసిన వరిని కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. చిన్నపాటి చినుకులు పడుతున్న కారణంగా పనలను గట్టుపై వేసుకోవాలన్నారు.

చి'వరి'లో కలవరం



యలమంచిలిలో నానుతున్న వరి పనలు

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం అన్నదాతల్లో గుబులు రేపుతోంది. రెండు మూడ్రోజులుగా యలమంచిలి ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఆకాశం సైతం పూర్తిగా మేఘావృతమై ఉండటంతో కర్షకులు కలవరపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి చివరి దశ వరకు అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. యలమంచిలి మండలంలో ఈ ఏడాది 2,105 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 40 శాతం కూడా కోతలు పూర్తి కాలేదు. గత మూడు వారాలుగా తుపాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాలతో వాతావరణ పరిస్థితులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంకా 60 శాతానికి పైగా వరి కంకులు కోత కోయాల్సి ఉంది. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే మొత్తం పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కంకులు బరువెక్కి నేల వాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కోతలు కోయకపోతే నష్టం వాటిల్లుతుంది. ఒకవేళ కోతలు పూర్తి చేసిన తర్వాత భారీవర్షం కురిస్తే మొత్తం పంట నష్టపోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో యలమంచిలి ప్రాంతంలో కొందరు రైతులు గురువారం ధైర్యం చేసి కోతలు చేపట్టారు. అదృష్టవశాత్తూ వర్షాలు కురవకపోవడంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం నుంచి వాతావరణం సాధారణ స్థితికి వస్తుందన్న నమ్మకంతో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఉపాధి హామీ పనులు త్వరగా పూర్తి చేయాలి

నక్కపల్లి: గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పల్లె పండుగ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. గురువారం ఆయన ఎంపీడీవో సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో చేస్తున్న పనులపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కార్యదర్శులంతా శానిటేషన్‌పై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాలువలు, రక్షిత మంచినీటి పథకాల వద్ద క్లోరినేషన్ చేయించాలన్నారు. రైతులంతా ఈకేవైసీ చేయించుకునేలా సచివాలయ సిబ్బంది అవగాహన పెంచాలన్నారు. గృహ నిర్మాణాలను సైతం వేగవంతం చేయాలన్నారు.

వెంకటాపురంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సచివాలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సప్పరం వాహనంపై వెంకన్న తిరువీధి



సప్పరం వాహనంపై తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఉపమాక వేంకటేశ్వర స్వామికి సప్పరం వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు చేశారు. కొండదిగువ ఉత్సవమూర్తులకు నిత్య సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని సప్పరం వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పదో పాశురాన్ని విన్నపం చేశారు. తదుపరి నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థగోష్టి ప్రసాద వినియోగం జరిగాయి. అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

మునగపాక: రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని మల్లవరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కమతాల్లో ఎటువంటి వివాదాలకు తావులేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ ఇందల హేమలత, రీ-సర్వేయర్ డీటీ పడాల్, వీఆర్వో సత్యనారాయణ, ఇందల నాయుడు, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



అందుకున్న స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని గరల్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 94 మంది విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను ఓం శ్రీసాయిరాం, శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ పి.రమేష్‌బాబు, ఎల్.యాజ్ఞవల్క్యశర్మ, లక్ష్మిపతిరాజు, అప్పారావు, సుబ్బారావు, సాయి కుమారి, కె.సుధ, ఎల్.జ్యోత్స్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.భవాని, కోడి నానాజీ, ఎం.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల బాదుడుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కంబాల జోగులు

పాయకరావుపేట: కూటమి ప్రభుత్వం విధిస్తున్న కరెంట్ చార్జీల బాదుడుపై శుక్రవారం తలపెట్టిన వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పాయకరావుపేటలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ దశల వారీగా విద్యుత్ చార్జీలు పెంచుకుపోతుందన్నారు. తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన కోట్లాది రూపాయల భారాన్ని తగ్గించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యుత్ వినియోగదారులు హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పట్టణ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, పంచాయతీ వార్డ్ సభ్యులు జగతా శ్రీను, లావేటి సన్యాసిరావు, నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, ధనిశెట్టి తులసి, పోసిన వీరబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండల అభివృద్ధికి కృషి చేయాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ కోన సంధ్య, ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

అచ్యుతాపురం: రాజకీయాలకు అతీతంగా అచ్యుతాపురం మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కోన సంధ్య కోరారు. ఆమె అధ్యక్షతన అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. తుపాను నష్ట పరిహారం అంచనా విషయంలో వ్యవసాయాధికారి ఇచ్చిన నివేదికపై సభ్యులు మండిపడ్డారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా నివేదిక, పరిహారం ఉండాలని సభ్యులు కోరారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ అచ్యుతాపురం మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం స్థానికులు భూముల్ని కోల్పోయారని, వారందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్ మాట్లాడుతూ గ్రామ కంఠం ధ్రువీకరణ పత్రాల విషయంలో వివిధ శాఖల అధికారులు ఒక్కో రకంగా చెప్పి తప్పించుకుంటున్నారని, అధికారులు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై డీఎస్పీ ఆరా



స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

నక్కపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ మోహన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబరు 31వ తేదీ సమీపిస్తున్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. మద్యం సేవించి కొందరు యువకులు అతివేగంగా బైకులు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని పేకాట, కోడి పందేలు, గుళ్లాటలు, పొట్టేలు పోటీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, పలు సూచనలు చేశారు. క్రైమ్ వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుకు సూచించారు.

'బడుగు వర్గాల ఆశాజ్యోతి రంగా'



వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాపు నాయకులు

పాయకరావుపేట: దివంగత వంగవీటి మోహన రంగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. గురువారం రంగా వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాపు నాడు మండల అధ్యక్షుడు కొమిరాల నాగార్జున, మంగవరం ఛానల్ అధ్యక్షుడు గుటూరు రామగోవిందు, కాపు నాయకులు దేవవరపు ఆనంద్, మద్దూరి సూర్యప్రకాష్, గంటా అప్పారావు, కాశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వసంత వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

పాయకరావుపేట: సీపీఐ శత వసంత వేడుకలను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావు జగ్గారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. సత్యవరంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్రలో పార్టీ ఎదుర్కొన్న సమస్యలు, పోరాటాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగులు అర్జునరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బందుల సుబ్బలక్ష్మి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్, రౌతు రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తడిసిన వరిపనలను పరిశీలిస్తున్న అప్పలరాజు తదితరులు

నక్కపల్లి: ఇటీవల వరుస వాయుగుండాల, వర్షాలు కారణంగా నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘ నాయకుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మనబానవానిపాలెంలో వరిపొలాలను పరిశీలించారు. అల్పపీడనం కారణంగా రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు తడిసిపోయిన వరి పనలను ఆరబెట్టుకుంటున్న రైతుల వద్దకు వెళ్లి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు పూర్తిచేసిన తర్వాత వర్షాలు పడటంతో వరి పనలు నీటిలో మునిగిపోయాయన్నారు. వీటిని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి, మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఎం.రాజేష్, సత్యనారాయణ రైతులు ఉన్నారు.